**నింగి రంగు** ఎప్పుడూ నీలమే. ఎంత వానకు తడిసినా, దాని రంగు వెలిసిపోదు. కడలి నీరు ఎప్పుడూ ఉప్పనే. ఎన్ని నదులు కలిసినా ఆ ఉప్పదనం తరిగిపోదు.

వినీత ఎన్నడూ అనాకారే. ఎన్ని కళలు నేర్చినా ఆ రూపం మారబోదు.

గుండెలోకి కసుక్కున దిగింది ముల్లు. రక్తం బొటబొటా కారుతోంది.

అరె ఇదేమిటి! గుండెలో ముల్లు గుచ్చుకుంటే కళ్ళలోంచి రక్తం కారుతోంది. పైగా ఈ రక్తం ఎర్రగా లేదు. అచ్చం నీళ్లలా వుంది. కానీ...కానీ రుచిమాత్రం ఒక్కటే. అదే ఉప్పగా! వినీత కెందుకో నవ్వొచ్చింది.

"మమ్మీ! నేను నాట్యం నేర్చుకుంటాను."

"నువ్వా! నాట్యమా!"

"ఏం? ఎందుకంత ఆశ్చర్యం? నాకు నృత్యమంటే ప్రాణం. ఎవరైనా నృత్యం చేస్తుంటే...నా అణువణువూ నాకు తెలియకుండానే కంపించిపోతుంది."

వక్కున నవ్వులు...చివుక్కున చూపులు.

"విన్నూ! కోప్పడకు. నర్తకి అంటే ఎలా వుండాలో తెలుసా? ఏ కళకైనా అందం అడ్డురాదు గాని, నృత్యకళకు అతి ముఖ్య లక్షణం సౌందర్యం. నృత్యాభినయవేళ తనువు చిరుగాలిలో విరజాజిలా పూగిపోవాలి. కలువల కనుదోయి కథలు చెప్పాలి. అధరాలు మధుర భావాలు వర్షించాలి..."

"చెక్కిళ్ళు అద్దాలై మెరిసిపోవాలి. కానీ...కానీ ఇవేవీ నాకు లేవు. అదేకదూ నువ్వు చెప్పేది? ఎంత సూటిగా, మోటుగా నా గుండెలో ఈటెలు దించావ్! అదే కన్నతల్లివైతే ఇలా అంటావా!"

"బహుశః...కాదుకాబట్టే నిజాన్ని నిరభ్యంతరంగా చెప్పగలుగుతున్నానేమో! నువ్వంటే నాకు ద్వేషం లేదు. అలాగని ప్రేమాలేదు. గడ్డిపువ్వును చూసి ముద్దుగులాబీ అని చెప్పలేను. నా మాటలో నిజాయితీ ఉంది. అద్దం చూసుకో. ఆలోచించుకో."

గుప్పెటనిండా గాజుపెంకులు తీసుకుని ముఖానికి చివ్వున విసిరిన అనుభూతి.ఎదురుగా బెల్జియం గ్లాసు ఆమె రూపాన్ని ఆమెకు నిష్పక్షపాతంగా చూపుతోంధి. 'కలువల కనుదోయి కథలు చెప్పాలి' ఆమె కళ్ళు విప్పార్చి చూసుకుంది.


పైరెప్ప...క్రిందిరెప్ప. నల్లగుడ్డు...తెల్లగుడ్డు. నల్లగుడ్డులో ఓ పావ కదలాడుతోంది. అన్నట్టు ఇంకేదో కంటినిండా కమ్ముకు వస్తోంది. అరె! క్షణంలో అది జారి ముత్యంలా వినీత చెక్కుల మీద దూకింది.

ఎంత చక్కగా ఉంది! అచ్చమైన మేలి ముత్యంలా...హేమంతపు తుషార బిందువులా...

"డాడీ! సంగీతం నేర్చుకుంటాను."

"ఇప్పుడెందుకమ్మా సంగీతం? ఫైనల్ పరీక్షలు దగ్గర కొస్తున్నాయేమో!"

"అవన్నీ మీకెందుకు, డాడీ? నేను చక్కగా చదువుకుంటాను. డాడీ! సంగీతమన్నా, నాట్యమన్నా...నాకెంత ఇష్టమో తెలుసా? నా ప్రాణా లిలా



అనంత వాయువుల్లో విలీనమై ఎప్పటికీ విశ్వగానం చేస్తుండిపోవాలి. ఓంకార నాద మయమైన సృష్టి పుటలలో అమరమై...అజరమై...నేను నర్తిస్తుండాలి."

ఎటనుండో పరిచితమైన నవ్వులు...చివుక్కుమంటూ చూపులు.

"విన్నూ! మొన్న నువ్వేదో పాట హమ్ చేస్తుంటే టేప్ చేశాను. ఇదుగో కే సెట్. ఇది విన్న తర్వాత నువ్వు ఇంకా సంగీతం నేర్చుకుంటాను అంటే...నిరభ్యంతరంగా నేర్పిస్తాం."

"విజీ? ఏమి టా మాటలు? విన్నూ! నీ ఇష్టం. నువ్వు నేర్చుకుంటానంటే నేను కాదంటానా, తల్లీ?"

"థాంక్యూ, డాడీ!?" ఎందుకో ఆమెగొంతు పూడుకుపోయింది.

టేప్ రికార్డర్ పలుకుతోంది...కే సెట్ గిర్రున తిరుగుతోంది...పాట విన్పిస్తోంది.

వినీతలో మౌనం. మౌనంలో ఒక విలయం. కోర్కెల పసికాయలు కొమ్మలనుండి రాలిపోతున్నాయి. ఆశాలతలు కూకటివేళ్ళతో తెగి నేలకు పడుతున్నాయి.

"సారికా! నువ్వెంత అందంగా ఉంటావో తెలుసా? వెన్నెల బొమ్మంటే నువ్వేనేమో! నువ్వు నాట్యం నేర్చుకుంటే ప్రేక్షకులు నీ పాదాలమీద ప్రాణాలు పెడతారు సుమా!" ఎందరివో ప్రశంసలు.

వినీత క్లాసుమేట్ సారిక నవ్వుతుంది. నవ్వి అంటుంది- "స్టేజ్ ఎక్కి ఎక్సర్ సైజ్ చెయ్యటమే కదూ నాట్యమంటే? కోతులు కూడా ఆ కొమ్మమీంచి ఈ కొమ్మ మీదకు గెంతుతాయి. అదీ ఓ నాట్యమే. చాలు చాల్లే, విన్నూ...నాట్యమంటే నాకు వళ్ళు మంట."

"రాజీ! నీ టోన్ చక్కగా ఉంటుంది. సంగీతం నేర్చుకోరాదూ?"

"ఏం సంగీతం, బాబూ, పాడిందే పదిసార్లు దీర్ఘం తీస్తూ స...పా...స...పా అని అపసోపాలు పడుతూ...ఓ గాడ్...ఐ హేట్ దట్ బ్లడీ మ్యూజిక్!"

సారికా అందం...నృత్యమంటే అసహ్యం

రాజీ స్వరం...సంగీత మంటే అయిష్టం.

వినీత అనాకారితనం...సంగీతం ప్రాణం...నృత్యం జీవం.

'భగవంతుడా! నీ సృష్టి ఎంత విచిత్రమైనది? ఇంత కళాతృష్ణని నాలో రగిలిస్తున్నావు...ఏ కాస్త అందాన్నో, ఇంపైన స్వరాన్నో ఇవ్వకూడదూ?'

టేప్ ఆగిపోయింది. ఆమె స్వరం విన్పించడం మానేసింది.

వంతుడే నాకన్నీ తక్కువ చేశాడు. తక్కువకాదు, అసలే ఇవ్వలేదు..."

"చాల్లే. నీకంటే అధ్వాన్నంగా ఉన్నవాళ్ళెందరో హాయిగా బ్రతికేస్తున్నారు. నువ్వే ఆలోచించి చూడు- రోడ్డుప్రక్కన కుష్టువాళ్ళు బ్రతుకుతున్నారా, లేదా? కనీసం నువ్వు ఆరోగ్యంగా నయినా ఉన్నావ్. వారికి అందం అటుంచి, అవయవాలే కుళ్ళిపోతుంటాయి. మరి వాళ్ళు ఆత్మహత్య చేసుకోవటం లేదే?" విజయ భ్రుకుటి ముడిచి చూసింది.

వినీత మనసు చివుక్కుమంది. ఆ పోలిక ఆమెకు నచ్చలేదు. "మరి మహామహా అందగత్తెలెందరో ఆత్మహత్యలు చేసుకుంటుంటారు. ఎందువల్ల నంటావ్, మమ్మీ?" ఉక్రోషంగా చూసింది.

"సింపుల్. వాళ్ళకేవో వ్యక్తిగత కారణాలుంటయి. దట్సాల్." విజయ నిర్లక్ష్యంగా పెదవి విరిచింది.

"మరి నాకూ వ్యక్తిగత కారణా లున్నాయి. నేనేం అందం కోసం దిగులుపడి ఆత్మహత్యా ప్రయత్నానికి పాల్పడలేదు. నా మనోవ్యథకు బలమైన కారణమే వుంది. అది నీక్కూడా తెలుసు."

విజయ పక్కున నవ్వింది. పడీపడీ నవ్వింది. కళ్ళలో నీళ్ళు తిరిగేలా నవ్వింది.


"నవ్వకు, మమ్మీ...నిన్ను చూస్తుంటే జాలేస్తోంది."

"ఎందుకట?"

"ఎదుటి మనిషి బ్రతుకును కేవలం నవ్వులాటగా భావించే నీ సంకుచిత మనస్తత్వాన్ని చూస్తుంటే జాలికాక మరేం కలుగుతుంది?"

"బోడి డాన్స్ నేర్చుకోలేక పోయానని చావబోవటం ఎంతటి విశాల మనస్తత్వం?" విజయ స్వరం హేళనతో మెలితిరిగింది.

"నీ దృష్టిలో కళకు విలువ లేదు. కనీసం కళాదృష్టి కూడా నీకు శూన్యం. నీకు తెలియదు, మమ్మీ! కళకోసం కొందరే పుడతారు. కళ ఆ కొందరికోసమే పుడుతుంది. కళాకారుడు ప్రియుడు...కళ అతని ప్రేయసి. కళ అత్యున్నత స్థానంలో నిలబడి కళాకారుడ్ని ఆహ్వానిస్తుంది.



# గుండె సవ్వడే

శంఖువరం సరోజా సింధూరి

"నీ పాట నువ్వు విన్న తర్వాతకూడా సంగీతం నేర్చుకుంటానంటే నిరభ్యంతరంగా నేర్పిస్తాం." విజయ స్వరమే వినీతకు విన్పిస్తోంది.

* * * *

"ఏం? ఎంతక్కువ చేశామని ఆత్మహత్యా ప్రయత్నానికి పాల్పడ్డావ్?" విజయ స్వరంలో గర్జన.

వినీత పెదవులుమీద చిరునవ్వు. అది పాలిపోయి ఉంది. అతి పేలవంగా ఉంది. "లేదు మమ్మీ...మీరు నాకేం తక్కువ చెయ్యలేదు. భగ

అతడికి కళపట్ల నిజమైన తృష్ణ ఉంటే...అగాధాలు దాటయినా, మహాసాగరాలు ఈదయినా ఆమెను అందుకుంటాడు. ఆ ప్రయత్నంలో ప్రాణాలైనా వదులుతాడు." వినీత కళ్ళు తడి తడిగా మెరిశాయ్.

"నువ్వు చెప్పింది అక్షరాలా నిజం. కానీ, కళ పిలిచేది తనను చేపట్టే అర్హతగల వారినే. అయోగ్యులను, అనర్హులను ఎంతమాత్రం ఆహ్వానించదని నా అభిప్రాయం."

"అవును, మమ్మీ. అందుకే...అందుకే ఈ అయోగ్యురాలు ఆత్మహత్యా ప్రయత్నానికి పాల్పడింది. కానీ, మృత్యువుకు కూడా నేనంటే జాలి లేదు."

వినీత వెక్కి వెక్కి ఏడ్చింది.

"నిన్ను నీవు చంపుకునే బదులు నీలోని ఆ కళాతృష్ణని చంపెయ్యి- ఏ బాధా ఉండ దిక." విజయ కళాతృష్ణ అన్నమాటను సాధ్యమైనంత వ్యంగ్యంగా పలికింది.

"నువ్వు రోజూ దాన్ని కొన్ని కొన్ని చంపుతూనే ఉన్నావ్‌గా!" వినీత రోషంగా చూసింది.

"అయితే, పరోక్షంగా నీకు సహాయపడుతూనే ఉన్నానన్నమాట." విజయ సాగదీసినట్టుగా అని, మళ్ళీ అంది- "సరే జరిగిందేదో జరిగింది. లేనిపోని పిచ్చితో ఇలా ఇంకోసారి ఆత్మహత్యకు ప్రయత్నించి మాకు చెడ్డపేరు తీసుకురాకు. అసలే సవతి తల్లిని. అనవసరపు నిందలొస్తాయి. ఆ దేవుడే డాక్టరు రూపంలో వచ్చి నిన్ను బ్రతికించాడు. లేకుంటే లోకం నీ చావుకి కారణం నేనే అనుకునేది."

"ఎందు కనుకుంటుంది? నేనెందుకు చస్తున్నానో కారణం వ్రాసిపెట్టాను కదా?" వినీత నొసలు చిట్లించింది.

"ఆఁ...ఈరోజుల్లో ప్రాణమున్న మనిషి మాటకే విలువలేదు. ఇక కాగితాలదేముంది కనుక?!" విజయ నిర్లక్ష్యంగా అనేసి చరచర వెళ్ళిపోయింది.

చల్లటిగాలి అలలు అలలుగా వీస్తోంది. వినీత బెడ్ మీద వెల్లికిలా పడుకుని ఉంది. ఆమె కళ్ళలో కన్నీరు అదే పనిగా ఊరుతోంది. బుగ్గల మీదకు ఏరులై జారుతోంది.

కుడివైపు గోడమీద ఆయిల్ పెయింటింగ్‌లో రాధ మైమరచి ఆడుతోంది. ఎడం వైపు మీరా జగం మరిచి పాడుతోంది.

వినీత చూపులు ఆ ఇద్దరి మీంచి మళ్ళీ మరో పెయింటింగ్ మీద నిలిచాయి.

మావి కొమ్మమీద ఎల కోయిల గళమెత్తి పాడుతోంది. పచ్చికనేల గరికపూలతో విరగబడుతోంది. పూలమధ్యలో వన మయూరి నాట్య మాడుతోంది.

కోయిల రూపం...పరమ వికారం. కానీ, దాని స్వరం...మధుర మయం...అమృత సమం.

నెమలి రూపం...మనోజ్ఞం...మనోహారం. కానీ దాని స్వరం కర్ణకఠోరం.

ఒక్కొక్క దానికి ఒక్కొక్క వరం. మరి తన రూపం? ఒక శాపం. తన స్వరం? ఎన్నో జన్మల పాపం.

తన కే వరమూ లేదు. త నెందుకూ పనికిరాదు. 'కళ' తన 'తృష్ణ'ని గుర్తించదు. తన ఆరాధన బదులివ్వదు. అసలు తన దరికే చేరదు.

వినీత చప్పున తలగడలో ముఖం దాచుకుంది. "భగవాన్! మరో జన్మంటూ ఉంటే నన్ను ఇలా పుట్టించకు."

* * * *

"డాడీ! బలవంతంగా డాన్స్‌లో చేర్పిస్తున్నావ్. ఆ కోరిక వున్న పాపానికే మమ్మీ ముందు నవ్వులపా లయ్యాను. ఇక నేను నాట్యం చేస్తుంటే ఎన్ని పెదవులమీద నవ్వులు పూస్తాయేమో!"

"విన్నూ! నీకు ముందే ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్. దానికి ప్రాణం పోసి పెంచింది మీ మమ్మీ. నీకెలా చెప్పాలో నాకు తెలియదు. నా కళ్ళకు నువ్వు బంగారు బొమ్మలా కన్పిస్తావంటే నువ్వు నమ్మగలవా, అమ్మా?" ఆర్ద్రతతో కంపించిపోయిందా స్వరం.

"కాకి పిల్ల కాకికి ముద్దు. ఇది సామెతే కదు, డాడీ?"

"సామెత కాదు. సత్యం, తల్లీ!"

"వస్తా, డాడీ! మరి డాన్స్ స్కూలుకు టయిమవుతున్నట్టుంది." వినీత వంగి తండ్రి పాదాలకు నమస్కరించింది.

×× ×× ××

'తక్కిట తకధిమి...ధిమి తకిటతక

తకిట తకధిమి...తకఝణు...తకధిమి...తకఝణు...'

స్వరం పలుకుతోంది...పదం ఆడుతోంది.

వినీత మనసులో పూలజల్లు...కళ్ళలో రంగుల హరివిల్లు.

ఆమె చెవుల్లో ఎవరివో కరతాళ ధ్వనులు.

నాట్యం ఆగింది...చూపుతోపాటుగా పసిడిమేనిఛాయతో, కవ్వించే కనుదోయితో...ఎవ్వడీ మన్మధుడు? కదిలించే అందమా? కవితలు వ్రాయించే చందమా?

"మీ పేరు తెలుసుకోవచ్చా?" అతని స్వరంలో గండుతుమ్మెదల ఝుంకారం, జుంటి తేనెల తియ్యదనం.

"వినీత."

"హౌ నైస్! ఎంతకాలం నుండీ నాట్యం అభ్యసిస్తున్నారు?"

"ఓ రెండు నెలల నుండేనండీ!"

"ఐసీ. నేను మాచెల్లాయిని ఇక్కడ చేర్పించాలని రావడం, మీతో ఇలా పరిచయం కలగడం...ఓహ్! హౌలక్కీ ఫెలో అయామ్!"

వినీత చప్పున కళ్ళు పెద్దవి చేసి చూసింది. 'ఎవ రితను? ఎందుకు తన నిలా పొగడుతున్నాడు? అతని మాటల్లో ఎక్కడైనా వ్యంగ్యముందా?' ఆమె మనసు ఆరాటంగా ఆలోచిస్తోంది. అతని మాటల్ని తిరిగి మననం చేసుకుంటోంది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

"నాతో పరిచయం మీపాలిటి అదృష్టమెలా అయ్యిందా అని!"

"కాకూడదా?"

"ఇట్ మే బి. బట్..." వినీత ఆగిపోయింది.

"ఊఁ...కానీ." రెట్టించాడు.

"ఏంలేదు." పొడిగా అంది.

"వస్తానండీ. సీ యూ టుమారో." అతను ముందుకు వెళ్ళి ఆగి తిరిగి అన్నాడు. "ఐయామ్ ప్రజ్వల్. నృత్యం నా ప్రాణం. సంగీతం నా జీవనం. నే నో కళాపిపాసిని"

"ఐ టూ!" అనుకోకుండా అంది వినీత.

"కళ నెప్పటికైనా దర్శించాలని, అందులో పులకించి పునీతమవ్వాలనీ నా ప్రగాఢ వాంఛ. నిజమైన కళ ఎక్కడుందో...ఎవరిలో కన్పిస్తుందో?" అతను వెళ్ళిపోయాడు.

వినీత ఎందుకో అతను వెళుతున్నవైపే మౌనిలా చూస్తూండిపోయింది. ఎవ రితను? ఎవరికీ పనికిరాని...ఏ అందానికీ నోచుకోని గడ్డిపువ్వుతో నేస్తం కడుతున్నాడు!

*** *** *** ***

"తొలిసారిగా కాలికి గజ్జె కట్టబోతున్నారు. మీ కళ్ళలో నీళ్ళేమిటి? ఆనంద బాష్పాలా?"

"కాదు. అచ్చమైన దుఃఖాశ్రువులు."

"కానేకాదట. మీ కళ్ళు చెబుతున్నాయి." అతని కళ్ళు ఆమె కళ్ళలోకి.

"నా కళ్ళకు మాటలు రావే?" ఆమె చూపులు అతని చూపుల్లోకి.

"ఎవరండీ అన్నారు అలాగని? మీ కళ్ళు వట్టి మాటలు కాదు...కథలే చెబుతున్నాయి నాకు." ప్రజ్వల్ పెదవులమీద చిరునవ్వు.

'కలువల కనుదోయి కథలు చెప్పాలి!' విజయ మాటలు చప్పున గుర్తు వచ్చాయి వినీతకు. "నా కళ్ళేం కలువలు కాదు కథలు చెప్పడానికి. ఒకవేళ చెప్పినా అవి కేవలం కన్నీటి కథలే!"

"కవితలకూ, కథలకూ జన్మస్థానం కన్నీళ్ళే. అన్నట్టు మీ రెందుకు అలాగున్నారో చెప్పనేలేదు."

"చెప్పక తప్పదా?"


"చెప్పండి."

"స్టేజిమీద నన్ను చూస్తే ఆడియన్స్ ఏం విసురుతారు?"

"ప్రశంసలు...పువ్వులు."

"కాదు... చెప్పులు, రాళ్ళు."

"ఎవరన్నారు అలాగని?"



"మమ్మీ!"

"మీరు ఆమె మాట నమ్ముతారా? నా మాట నమ్ముతారా?"

వినీత బదులుచెప్పలేదు.

"చెప్పండి."

ఆమెలో మౌనం.

"చెప్పరా?"

మరీ నిశ్శబ్దం.ఒక్క కన్నీటి చుక్క మెల్లగా ...అతి మెల్లగా చప్పుడు చేయకుండా జారి ప్రజ్వల్ చేతిమీద పడింది. ప్రజ్వల్ చివుక్కున వినీతవంక చూశాడు."వినీతా! నే నొక్కమాట అడగనా?"

మౌనంగా కదిలాయి ఆమె కనురెప్పలు.

"మీ కసలు నృత్యకళ అంటే ఇష్టమేనా?"

చప్పున తలెత్తింది వినీత. ఆమె కనుపాపలు చిత్రంగా కదిలాయి. "నృత్యం నా ప్రాణం. నాప్రాణం నాకు అయిష్టమా? అదెలాగ!" అస్పష్టంగా అంది.

"లేదు. కళారాధన అంటే ఇలా వుండదు. కళారాధకులకు ఒకే చూపు వుంటుంది. ఆ చూపుకు కేంద్రం కళ. అంతే. అది అల్పుల మాటలను లక్ష్యపెట్టదు. ఎవరో ఏదో అన్నారనీ, అనుకుంటారనీ వెనుకంజ వెయ్యదు. అది ఒక తపన. ఒక తపస్సు. అది కళకు ప్రాణం పోస్తుంది. కళలో జీవిస్తుంది. చివరకు కళతోనే లయిస్తుంది." అతని స్వరంలో ఉద్వేగముంది.

వినీత రెప్పలు విప్పార్చి చూసింది అతన్ని. 'ఎవరితను? తను నిరాశా నిశీథిలో కొట్టుకుపోయే వేళ దారిచూపుతూ...చుక్కానిలా—'

"ఛీ...బుద్ధి గడ్డితిని నాట్యంలో చేరాను. చివరకు డాన్స్ టీచర్ కూడా నాగురించి ఎవరితోనో కామెంట్ చేస్తోంది. ఇక నేను మానేస్తాను." ఒకనాడు వినీత—

"నిజం. మీ బుద్ధి గడ్డే తింటోంది. లేకుంటే...కాకుల స్వరానికి కోకిల చిన్నబుచ్చుకోదు. ఎవరో కామెంట్ చేస్తున్నారని వినీత మానుకోదు." అన్నాడు ప్రజ్వల్—

"నా కళ్ళు చిన్నవట. హావభావాలను అభినయించలేనట." మరోనాడు ఆమె కళ్ళలో నీటిచుక్క.

"మీ కళ్ళు చిన్నవే కావచ్చు. కానీ, ఏ కళ్ళలోనూ లేని ఆర్ద్రత మీ కళ్ళలో వుంది. చాలా చిన్నదైన వాన చినుకులలోనే ఏడు వన్నెల హరివిల్లు మెరిసేది." ప్రజ్వల్ ఊరడింపు.

"నేనంటే మీ కభిమానం. అందుకే అలా అన్పిస్తుంది."

"కాదు...మీలోని కళ అంటే నాకు అభిమానం, ఆరాధన!"

"వట్టి పొగడ్తలు."

"కాదు... పచ్చి నిజాలు."

ఎందుకని అత డలా తనను ప్రోత్సహిస్తున్నాడు? అతని ప్రోత్సాహమే లేకుంటే తను ఏనాడో నాట్యానికి నుస్నా చుట్టేది. తన కోరికకు సజీవ సమాధి కట్టేది.

"ఏమిటీ ఆలోచనలు?" ఆమె జ్ఞాపకాలను చెదరగొట్టిం దా ప్రశ్న.

"ప్రజ్వల్! అసలు మీ రెవరు? నాలో ఆశల దీపం ఆరిపోయేవేళ వత్తులు సవరించి తైలం పోశారు?" వినీత వింతగా చూసిం దతన్ని.

అతని చూపెందు కో క్షణం అనంతంలోకి చొచ్చుకుపోయింది. ఒక వెచ్చని నిట్టూర్పు వెలువడింది.

"వినీతా! మీరు ఆత్మహత్యా ప్రయత్నానికి పాల్పడినపుడు మిమ్మల్ని ఎడ్మిట్ చేసిన హాస్పిటల్ మాది. డాక్టర్ రఘువీర్ మాడాడీ. మీ గురించి డాడీ చెబుతుంటే విన్నాను. నాకు పెక్యులియర్‌గా అన్పించింది- కళకోసం ప్రాణం తీసుకోబోయిన మిమ్మల్ని చూడాలన్పించింది. సెకాలజీ నా సబ్జెక్టు. అందుకే మిమ్మల్ని బెడ్‌మీద చూడలేదు. నృత్యాభినయవేళ చూశాను. మిమ్మల్ని డాన్స్ స్కూల్లో వెంటనే చేర్పించమని మీ డాడీని ఫోర్సు చేసింది నేనే!" ప్రజ్వల్ ఆగి వినీత వంక చూశాడు.

"ఇంకా చెప్పండి." వినీత అస్పష్టంగా అంది.

"వాస్తవానికి నేను కళారాధకుణ్ని. కళ కోసం ఎన్నాళ్ళుగానో ఎదురుచూస్తున్నాను. ఏ కళాకారిణిలోనూ నేను నిజమైన కళను దర్శించలేకపోయాను. కానీ...కళమీద మక్కువతో ప్రాణాలు తీసుకోబోయిన మిమ్మల్ని చూశాను.. అంతర్గతంగా మీలో దాగున్న కళను గుర్తించాను. ఆ కళనే నేను ప్రేమించాను. ఆరాధించాను. దాని అభివృద్ధికి తోడ్పడ్డాను."

"ప్రజ్వల్! నా కళాతపోఫలం మీ దన్నమాట."

"ఏమో! అన్నట్టు మీరు నా కో మాటివ్వాలి."

"ఏమిటి?"

"ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరో ఏదో అన్నారని కళని మీరు కించపరచకూడదు. మీలో రగిలే తపనను ఆరనివ్వకూడదు. ప్రేక్షకులేం గుడ్డివాళ్ళు కాదు. కళను గుర్తించలేనంత మూర్ఖులు కాదు."

"అవును,ప్రజ్వల్. మీరన్నట్టు నాలోని ఈ తపన కళలోనే లీనమవుతుంది. కళతోనే లయిస్తుంది." వినీత మౌనంగా అనుకుంది.

*** *** *** ***

"మనిషిని చూడగానే లేచిపోదా మనుకున్నాను. కానీ...ఆమె నాట్యం చేస్తుంటే తెలిసింది...నటరాజుకు వారసురాలని."

"బాప్‌రే...నే నింతవరకు ఇలాంటి నృత్యహేల చూడలేదు."

"బాబోయ్...ఆ అభినయానికి నా అణువణువూ కదిలిపోయిందనుకో!"

"నేను పుట్టి బుద్ధెరిగినాక ఇంత గొప్ప నర్తకిని చూడటం ఇదే మొదటిసారి."

"మేడమ్...ఆటోగ్రాఫ్ ఇవ్వండి."

"ప్లీజ్...ఆటోగ్రాఫ్..."

"మిస్...చిన్నపోజు. ఒక్క స్నేప్!"

"చేతి మీద సైన్ చెయ్యరూ?"

వినీతకు ఊపిరి తిరగడంలేదు. ముందుకు అడుగువడటంలేదు. అయోమయంగా వుంది. ఆనందంగావుంది. కంగారుగా ఉంది గమ్మత్తుగా ఉంది...భయంగా...థ్రిల్లింగ్‌గా...

దూరంగా రెండు కళ్ళు తనను గుచ్చి చూస్తున్నాయి. ఆ కళ్ళలో ఎప్పుడూ అసహ్యముండేది. ఇప్పుడేదో భావముంది.

ప్రవాహాన్ని ఈదుకుని గ్రీన్‌రూమ్‌లో కొచ్చింది వినీత.

గుండెనిండా ఏదో అలజడి...వింత వింత సందడి. ఒళ్ళెందుకో తూలుతోంది. మన సెందుకో మూగవోతోంది.

తన ఎదురుగా జాజ్వల్యమానంగా ప్రజ్వల్!

దూరంగా వున్న కళ్ళు మరింత దగ్గరగా...ఆ కళ్ళలో హేళన లేదు. మరేదో వుంది.రెండు చేతులు దగ్గరగా వచ్చాయి. చప్పున వినీతను గుండెకు హత్తుకున్నాయి. "విన్నూ...నా విన్నూ!..నీ లోని కళకు నేను నమస్కరిస్తున్నా నమ్మా!" విజయ కళ్ళ నుండి కన్నీరు జారుతోంది.

వినీత కళ్ళు చటుక్కున ప్రజ్వల్‌మీద నిలిచాయి.

ప్రజ్వల్ ఆమె కళ్ళలో ప్రజ్వలిస్తున్నాడు. అతని వంక కలలోలా నడిచింది. "నాలోని కళ ఇలా ప్రజ్వలించడానికి...నా ప్రజ్వల్...నువ్వే కారణం. మమ్మీ...మమ్మీ! నన్ను మెచ్చుకుంటోంది. ఈ ఆనందపు అలజడిని నా గుప్పెడు గుండె భరించగలదా? ఇది కల కాదుగదా!" ఆమె చప్పున అతడ్ని పెనవేసింది. అలాగే అతని పాదాలమీదకు జారిపోయింది.

"ఇది కల,కాదు, విన్నూ! నీలోదాగున్న కళ. నువ్వు కళా తపస్వినివి. నీ తపస్సు ఈనాటికి ఫలించింది." వినీత భుజాలు పట్టుకుని లేవనెత్తాడు.

వినీత తిరిగి అతని భుజాలమీద వాలిపోయింది. ప్రజ్వల్ చప్పున ఇవతలికి తీశాడు. వినీత అతన్నే చూస్తోంది.

ఆమె కనురెప్పల్లో కదలిక లేదు. గుండెల్లో స్పందన లేదు.

ఆమె ముఖంలో నిశ్చలమైన పారవశ్యం. ఆ చూపుల్లో శాశ్వతమైన తాదాత్మ్యం.

"విన్నూ!" ప్రజ్వల్ స్వరం దిగంతాలను తాకి, అనంతాలను దాటి, గుండెలను చీల్చుకుంటూ...చెవులను బ్రద్దలు కొట్టుకుంటూ...

"కళ కళలోనే జీవించింది. కళకు ప్రాణం పోసింది. చివరకు కళలోనే లయించింది"

ప్రజ్వల్ తడి కళ్ళలో...విడివడని పెదవుల్లో...తడబడే గుండెల్లో ఒక్కటే భావం...దానికి ఒకే ఒక్క భాష్యం. ●

